కథానిక

# అర్థంకాదు లోకానికి

యం. జానకీరాణి

రాత్రి రెండు గంటలైంది. నిశ్శబ్దంగావున్న ఆ వాతావరణంలో ఒక వ్యక్తి నడిచిపోతున్నాడు. అతని చేతిలో డాక్టర్ల తోలుసంచీ వుంది. పొడుగాటి కోటు, టోపీ ధరించి వున్నాడతను. అర్థరాత్రి నిశ్శబ్దతని చీల్చుకుని అతని బూట్ల చప్పుడు వినిపిస్తోంది. ఇంతలోనే మరొక వ్యక్తి—పోలీసు—ప్రక్క సందులోంచి ఆవీధిని ప్రవేశించాడు. నిర్మానుష్యమైన వీధిలో నడిచిపోతున్న వ్యక్తివాలకం అనుమానాస్పదంగా తోచింది పోలీసుకి. వెంటనేవెళ్ళి అతన్ని కలుసుకున్నాడు.

"ఈ అర్థరాత్రివేళ ఏం పనిమీద వెడుతున్నారో చెప్తారా?" అన్నాడు గంభీరంగా, అధికార పూర్వకంగా. ఆవ్యక్తి తొణకలేదు, తోలుసంచీ తెరిచి బంగారు కేసులోంచి ఒక విజిటింగుకార్డుతీసి చూపాడు. వీధిదీపం గుడ్డివెలుతురులో పోలీసు చదివాడు. వెంటనే వినయంగా ఆకార్డు తిరిగి ఇచ్చి, "క్షమించండి డాక్టరుగారూ రోజులు బాగుండలేదు కదూ! అందుకని కాస్త జాగ్రత్తగా వుంటాం." అని సెల్యూట్ చేశాడు.

పోలీసు వెళ్ళిపోయాడు. డాక్టరు బూట్ల చప్పుడు చేసుకుంటూ ముందుకుసాగాడు. మెల్లిగా నవ్వుకున్నాడు. అతను పగటిపూట ఎంత గొప్ప డాక్టరో, రాత్రిపూట అంత నేర్పరియైన దొంగ. రోజంతా ఎంతో పెద్దమనిషిగా వ్యవహరిస్తాడు. రాత్రివేళ ఎన్నో దొంగతనాలు చేస్తాడు, చేయిస్తాడు. ఎన్నో విలువైన ఔషధాలు ఇంజెక్షన్లు వున్నాయి అతని తోలుసంచీలో. వాటితోపాటు మారుతాళం చెవుల గుత్తులు, అనేక విచిత్రద్రావకాలుకూడా వున్నాయి. రెండు వృత్తుల్లోను అతను ప్రావీణ్యం సంపాయించాడు. రెండింటిమీదా సమానమైన ఆసక్తివుంది అతనికి. పోలీసుల నీవిధంగా మోసం చేయడం ఇది ఎన్నోసారో. అందుకే నవ్వుకున్నాడతను.

దూరాన అడుగుల చప్పుడు వినిపించి, దగ్గరైంది. ఒక అమ్మాయి ప్రక్కసందులోంచి పరుగెత్తుకు వచ్చింది. వస్తూనే సంచీనిపట్టి డాక్టరుని గుర్తించింది. ఆమె చాలా కంగారుపడుతోంది.

"ఏమండీ, మీరు డాక్టరుగారు కాదూ? మా యింటికి రండి. మా అయ్యగారికి చాలా జబ్బుగా వుంది. మా అమ్మగారు ఆదుర్దాపడుతున్నారు. రండి." అన్నది గబగబా. డాక్టరు ఆలోచించలేదు. ఆమె వెంట నడిచాడు. రెండు వీధులు దాటి ఒక పెద్ద భవనాన్ని చేరుకున్నారు వాళ్ళు. హాల్లోకి తీసుకువెళ్ళింది ఆపిల్ల. ఆ భవనం చాలా పెద్దది. కానీ పురాతనంగా వుంది. హాలు ఎంతో పెద్దది. దాన్లో చాలా ఫర్నీచరువుంది. కానీ అన్నీ మాసిపోయినట్లుగా దుమ్ము కొట్టుకుపోయి వున్నాయి. సోఫామీద ఒక వ్యక్తి సూటుతో పడివున్నాడు. అతని ప్రక్కనే స్టూలుమీద ఒక స్త్రీ కూర్చునివుంది. ఆవ్యక్తి ముఖంలో జీవకళలేదు. అప్పుడే ఎక్కడినుంచో వచ్చినట్లున్నాడు. కాళ్ళకి బూట్లుకూడా వున్నాయి. ఆస్త్రీ డాక్టరుని చూసి లేచినుంచుంది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయివుంది.

"ఈయన ఇప్పుడే విందునుంచి వచ్చారు డాక్టర్. వస్తూనే ఇల్లా పడిపోయారు. కాళ్లు, చేతులు చల్లబడిపోయిగాయి. మాటలేదు. మూసిన కన్ను తెరవలేదు." అన్నదామె. ఆమె పెదవులు వణుకుతున్నాయి. కంఠం గద్గదికమైంది. డాక్టరు మాట్లాడకుండా స్టెతస్కోపుతీసి పరీక్షించాడు. ఆవ్యక్తి గుండె చాలా నీరసంగా కొట్టుకుంటోంది. పరిస్థితి విషమించిందని గ్రహించాడు డాక్టరు. గుండె జబ్బున్నది. దానిపైన విందులో బాగా త్రాగినట్లున్నాడు, ఇంకో అరగంట మించి బ్రతికే అవకాశం లేదని తోచింది డాక్టరుకి. ఒక్క నిమిషం తల వంచుకున్నాడు. మెల్లిగా తలయెత్తి,

తనవంక ఆత్రుతగా చూస్తున్న ఆ స్త్రీని చూశాడు. ఆమెకి చెప్పకుండా ఎల్లా వుండటం?

“పరిస్థితి అట్టే బాగుండలేదు. కానీ...” అంటుండగానే ఆమె ఏదో చెప్పబోయింది. కానీ నిలవలేక ప్రక్కకి తూలిపడి పోయింది. ఆమెకి స్పృహ తప్పింది. దాసీపిల్ల ఆమెని పట్టుకుంది. మరో సోఫాలో పడుకోబెట్టింది ఆమెని. డాక్టరు దగ్గరకెళ్ళి చూశాడు. చాలా నీరసంగావుంది ఆమె దేహస్థితి. సరైన పోషణలేక క్షీణించినట్లుగా ఉంది ఆమె శరీరం.

“ఇంకెవరూ మనుష్యులు లేరా ఇంట్లో?” అనడిగాడు డాక్టరు. అంత పెద్ద భవంతిలో వేరే అలికిడి లేకపోవడం అతనికి ఆశ్చర్యంగావుంది. “లేరండీ” అన్నది దాసీపిల్ల. ఆ పిల్ల ముఖంలో కళాకాంతులు లేవు. తన యజమానురాలు, యజమాని ఇద్దరూ ఇల్లాంటి విషమస్థితిలో వున్నారు.

“స్పృహ వచ్చేవేళకి ఈమెనిక్కడ వుంచడం మంచిదికాదు. భర్త ఎదురుగా వుంటే ఈమెకి మళ్ళీ స్పృహ తప్పవచ్చు. లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టాలి. ఎవరూ లేకపోతే ఎల్లామరి?” పనిపిల్ల నిస్సహాయంగా చూసింది. డాక్టరు స్తెతస్కోపు తీసి బల్లమీద పెట్టాడు. కోటుచేతులు పైకి లాగాడు. తప్పదు అత్యవసరపరిస్థితి ఆ స్త్రీని సోఫామీదినించి ఎత్తాడు. అతి తేలిగ్గావుంది ఆమె శరిరం. దాసీపిల్ల చూపిన గదిలో మంచం మీద పడుకోపెడదామని.

“తెలివిరాగానే పళ్ళరసం తాగించాలి. పోనీ బ్రాందీ ఏమైనా వుందా ఇంట్లో?” అనడిగాడు. పనిపిల్ల లేదన్నట్లు తల వూపింది. డాక్టరుకిది మరీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇంత సంపన్నుల ఇం్ల ఒక చుక్క బ్రాందీ లేదూ?

“పోనీ కొనుక్కురా. ప్రక్కన సిరి హోటలు దగ్గర షాపు వుంటుంది.” అన్నాడు. ఐ అపిల్ల కదలక పోవటం చూసి “వెళ్ళిరా” న్నాడు ఆజ్ఞాపూర్వకంగా.

“డబ్బులేదండీ.”అన్నది ఆ అమ్మాయి మెల్లిగా.

“మీ అమ్మగారు ఎక్కడ పెడుతుందో తెలియదా నీకు?” అన్నాడు డాక్టరు. అతనికి చీకాకు కలుగుతోంది. ఈ కేసు ఎందుకు వచ్చిందిరా భగవంతుడా అని అతను చింతిస్తున్నాడు. ఆపాటికతను పెద్ద వీధిలోని ఒక షాపులోకి ప్రవేశించి వుండాల్సింది. వేసుకున్న ప్లానంతా చెడిపోయింది! వెధవ డాక్టరీ వుద్యోగం! అని మనస్సులో అతను తిట్టుకున్నాడు. పనిపిల్ల తల వంచుకునేవుంది.

“అసలు ఇంట్లోనే| లేదండీ డబ్బు. అయ్యగారే అంతా ఖర్చు పెట్టేశారు. అమ్మగారు నిన్నా, ఇవాళ్ళ ఏమీ తినలేదండీ డబ్బులేక.” అందా పిల్ల డాక్టరు మరింత నిందించుకున్నాడు తనని తాను. అతనికి కోపం వచ్చింది.

“మరైతే—డబ్బు లేకుండా ఎందుకు పిల్చావమ్మాయ్ నన్ను? ఏంచేస్తావో మరి. నేను వెళ్ళాలి. నా కవతల పనుంది.” అంటూ సావిట్లోకి వచ్చాడతను. ఆ పిల్లకూడా అతని వెంటవచ్చింది. ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

“డాక్టరుగారూ, మా అమ్మగారు చచ్చిపోతారండీ, మీరు వెళ్ళొద్దండీ”అన్నది ఏడుపు కంఠంతో. స్తెతస్కోపు తీసుకుని కుర్చీలో కూలబడ్డాడు డాక్టరు. ఏమూలో డాక్టరులో మానవత్వంవుంది. పాపం! ఈ పిల్ల ఏమౌతుంది నిస్సహాయంగా, ఆ స్త్రీ, ఈ పురుషుడు అంతా ఏమౌతారు తను వెళ్ళిపోతే? అనవసరంగా ఎన్నిప్రాణాలకు ముప్పు! వాళ్ళిద్దరికీ ఏమన్నా జరిగితే ఈ పనిపిల్లని పోలీసులు ఏంచేసినా చేస్తారు. మెల్లిగా పర్సు తెరిచి ఐదు రూపాయలు తీసిచ్చాడు డాక్టరు. “పో, ఏమన్నా కొనుక్కురా”అన్నాడు పనిపిల్ల వెళ్ళింది.

మెల్లిగా సోఫాలో పడివున్న వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు డాక్టరు. అతను కళ్లుతెరచి చూస్తున్నాడు. ఏదోచెప్పాలని తహతహలాడుతున్నాడు. పెదవులు కదులుతున్నాయి. కానీ మాట రావడం లేదు. అతనికళ్ళల్లో బాధ. మృత్యువును సమీపిస్తున్నాడు నిశ్చయంగా. డాక్టరు ముందుకు వంగి అతని చెవిదగ్గర తననోరు పెట్టాడు “మీ భార్య మీ సంగతివిని, స్పృహతప్పి పడిపోయింది. ఆమె కేమన్నా చెప్పాల్సి వుంటే నాతో చెప్పండి.” అన్నాడు మెల్లిగా. కానీ ఆ వ్యక్తికి నోటమాట రావడంలేదు. కళ్లు మూతలుపడ్డాయి.

డాక్టరు వెంటనే తన తోలుసంచీ తెరిచాడు. ఒక సిరెంజి తీశాడు. ఏదో మందు ఎక్కించాడు. ఆ వ్యక్తికి ఒక ఇంజెక్షనిచ్చాడు. ఐదునిముషాల్లో ఆ వ్యక్తి కళ్ళు తెరిచాడు. అతనిలో కొద్దిగా శక్తి

వచ్చింది. డాక్టరుని ముందుకు వంగమని సైగ చేశాడు. బలమంతా కూడగట్టుకుని మాట్లాడ సాగాడు.

“మా ఆవిడ చాలా మంచిది-ఆవిడ తాలూకు డబ్బు 20 వేల రూపాయలు బ్యాంకులో వుండాలి. అవి తీసి ఎవరికో అప్పిచ్చానని చెప్పాను ఆవిడకి. ఆమె దానిమీద ఆశపెట్టుకుని కూర్చుంది. కానీ-అదంతా ... నేను ఖర్చు పెట్టేశాను. ఈరోజు తెస్తానని చెప్పాను. ఆమెకి...తినడానికి కూడా ఏమీ లేదు ... ఇల్లంతా...గుల్ల చేశాను.” అతని కంఠం రుద్ధమైంది. “మీరు...ఈసంగతి...డబ్బు ఐపోయిందన్న సంగతి చెప్పాలి ఆమెకి. సామాన్ల అమ్మేయమని చెప్పాలి ఆమెకి. చూడండి, ఆ మూల...ఇనప్పెట్టెలో ఈ ఉదయం డబ్బు పెట్టానని...తాళం చెవులు పోయాయనీ చెప్పాను... అబద్ధం-సర్వాబద్ధం. తాగేశాను - అంతా తాగేశాను......చెప్పండి...” ఆయాసపడ్డాడతను. డాక్టరు చేతిని పట్టుకున్న అతని వ్రేళ్ల పట్టు సడలాయి. అతని కళ్ళల్లో కాంతి ఒక్కమాటు జ్వలించింది. అంతే. ఆరిపోయింది.

అతని రెప్పలు తన చేతులతో మూశాడు డాక్టరు. ఈ మృతదేహం - ఏం చేస్తాను డాక్టరు? తోటిమానవుడు తన కళ్ళముందే చనిపోయాడు. ఎన్నో హృదయ విదారక దృశ్యాలు చూశాడు డాక్టరు. కానీ ఎప్పటికప్పుడు ఒక విమాత్నా వేశం, ఒక వైరాగ్య భావం అతని మనస్సులో పొడసూపుతుంది. కానీ—ఇంతలోనే డాక్టరు మనస్సు వేరొకదిశలో పని చేయసాగింది.

ఇరవై వేల రూపాయలు! ఉంటే, ఈ ఇనప్పెట్టెలో వుండాలి. ఆ డబ్బు లేదు. పోనీ, మరేమైనా విలువైన వస్తువు లుండవూ? ఇంకేమీ వుండదూ? చూస్తే? వీధి తలుపు చేరవేశాడు డాక్టరు. అతడు తన ప్రధానవృత్తిని కట్టిపెట్టాడు. అతని రెండో వృత్తి తాలూకు పరికరాలు ఒక్కటొక్కటే తీశాడు. ఇనప్పెట్టెని సమీపించి, ఒక్క నిముషం తాళం పరీక్షించాడు. వెంటనే తన దగ్గరున్న గుత్తిలోని రెండు మూడు తాళం చెవులు త్రిప్పిచూశాడు. కానీ, అది వూడలేదు. సంచీలోంచి ఒక ద్రావకంసీసా తీశాడు. రెండే రెండు బొట్లు ఆ తాళం చిట్టల్లో పోశాడు. రెండు నిముషాల్లో మెత్తగా తాళం తెరిగింది. తలుపు తీశాడు. అన్ని సొరుగులు ఖాళీ!

ఇంతలో వీధి తలుపు అలికిడైంది. డాక్టరు ఇనప్పెట్టె తలుపు ఒక్క తోపు తోసి, ఒక్క అంగలో వచ్చి సోఫాలో కూలబడ్డాడు. పనిపిల్ల వచ్చింది. పళ్ళు బ్రాందీ కొనుక్కొచ్చింది. గది లోకి వెళ్ళి రెండు నిముషాల్లో తిరిగివచ్చింది. “అమ్మగారు లేచారండీ. బ్రాందీ తాగించాను. ఓపిగ్గానే వున్నారు. అయ్యగారి కెల్లా వుందో చూడమన్నారు” అంది పనిపిల్ల. డాక్టరు నిర్లక్ష్యంగా వున్నాడు.

“మీ అయ్యగారు పోయారు. అమ్మగారితో హఠాత్తుగా చెప్పకేమాట. ఆవిడకి మతిపోతుంది.” అంటూండగానే ఆమె హాల్లోకి వచ్చింది. ఆమె నీరసంగానే వుంది. కానీ ఆమె కళ్ళు జీవంతో నిండాయి. అడుగులు బలంగానే వేస్తోంది.

“ఎల్లాగున్నారాయన?” డాక్టరు మాట్లాడ లేదు. చనిపోయిన వ్యక్తి కోరిక ప్రకారం ఆమెకు ఆ డబ్బుని గురించి చెప్పాలి. త్వరగా తను వెళ్ళిపోవాలి ఇక్కణ్ణుంచి. కాని చెబితే ఏమౌతుంది ఈమె? ఇరవై వేల రూపాయలు! ఆమె శేష జీవితం నిర్విచారంగా గడిచేది. పాపం, ఈమెనిల్లా నిస్సహాయంగా విడిచి వెళ్ళటం ధర్మమా? పరిపరి విధాల ఆలోచిస్తున్నాడు డాక్టరు.

“ఏమండీ? ఎల్లా వున్నారాయన?” అంటూ ఆమె సోఫాదగ్గరకు వచ్చింది.

“ఆయనా? ఫర్వాలేదు. చూడండి...మీ తాలూకు...” డాక్టరు తోలుసంచీలో ఎనిమిది వేల రూపాయలున్నాయి. గతరాత్రి ఒక బాంకీలో కొల్లగొట్టిన మొత్తమది. ఆ నాటి మధ్యాహ్నమే నోట్ల నెంబర్లు పట్టుకోకుండా వుండటానికి బాంకులో మార్చేశాడు వాటిని. ఆ సొమ్ము లేకపోతే తనకి గడవకపోదు. ఇన్ని ఆలోచనలు గబగబ నడిచాయి డాక్టరు మనస్సులో. పాపం ఈ అనాథస్త్రీ! తనదగ్గరున్న ధనం...!

“చూడండి, మీరు కూర్చోండి. గాభరా పడకండి. మీ తాలూకు డబ్బు ఇరవై వేల రూపాయలుండాలిట కాగా? ఆ సొమ్ము ఈ రోజు తెచ్చి ఇనప్పెట్టెలో పెడతానన్నారుట ఆయన. నాచేత తెరిపించాడు పెట్టె. ఇరవై వేలలో చాలాభాగం ఖర్చయిపోయిందిట. ఈ ఎనిమిది వేలు మీ కిమ్మ

స్తారు..." అని తోలుసంచీలోంచి నోట్లకట్టలు తీశాడు డాక్టరు. ఒక గజదొంగలో ఈ త్యాగ బుద్ధి, ఈ మానవత్వం, జాలి—అంతా అతనికే ఆశ్చర్యంగా వుంది.

డబ్బుసంగతి ఎత్తేసరికి ఆమె కళ్లు పెద్దవిచేసి చూసింది. ఆమె గబగబ పరుగెత్తికెళ్ళి ఇనప్పెట్టె సొరుగులన్నీ తడిమింది. ఇనప్పెట్టె తెరిచివుంది! భర్త ఈలోకంలో లేదు! ఇరవై వేలు—అంతా వుండాలి. ఏమైంది? తన జీవితసర్వస్వం—ఇన్నాళ్లూ తన ప్రాణాలన్నీ ఆ డబ్బుమీదే పెట్టుకుంది. ఈ డాక్టరు—! ఆమె శరీరం ఝల్లుమంది. సోఫా దగ్గరికెళ్ళి భర్తని చూసింది. అతని శరీరం చల్లగా కొయ్యలాగావుంది. కెవ్వుమని కేకవేసింది ఆమె. కానీ—డబ్బు?

ఆమె ఒక్కనిముషం డాక్టరువంక చూసింది. అతనిచ్చిన నోట్లవంక చూసింది.

"నువ్వు—నువ్వు దొంగ! గజదొంగవి! పన్నెండు వేలు మింగేశావే. పన్నెండువేలు మింగేశావు! దొంగ!" కీచుమని గోలగా అరుస్తోందామె.

డాక్టరు నిర్ఘాంతపోయాడు. తను జన్మలో చూపించని ధర్మబుద్ధి చూపించాడు. ఎన్నడూ చేయలేని గొప్పత్యాగం చేశాడు. కానీ—లోకం! తను ఎంత గజదొంగైనా మన్నిస్తుంది. కానీ నిజమైన త్యాగాన్ని నమ్మదు. అతని ముఖాన చిరునవ్వు విరిసింది.

"ఔను దొంగనే. ఈ ఎనిమిదివేలు కూడా నాకే కావాలి." అంటూ ఆమె చేతిలోని నోటు లాక్కున్నాడు. ఒక్క వురుకులో వీధిలోకి దూకి చీకట్లోకి మాయమైనాడు.

(ఓ హెన్రీ ఆధారంగా)

# శ్మశానంలోని కీర్తి స్తంభాలు

రంగారావు

నాటి సుజాతకుల హృదయ
ద్వార కవాటాల ముందు
ప్రేమామృత రస పూరిత జిహ్వాలు
చాచి తారాడిన మహా భుజంగాలు
దివా రాత్రులు కనుల ముందు
నటియించిన పెను భూతాలు
పాద మెత్తలేని నోరు కదపజాలని
కాల శ్మశానంలోని కీర్తి స్తంభాలు
నాడు వేదనలతో సుస్పందించగ
హృదయాబ్జము; శోకంతో చిక్కని
నీరై నిల్చిన వెచ్చని గుండియతో,
బాధలతో కంపించిన తనూశైలము
నేడు దాళధళ్య స్ఫటిక మయ
ప్రాంశు మూర్తియై, సుప్రశాంత మౌన
భాషతో, ప్రతి మనీషి గుండె
నూపి మాట్లాడే దెవరెరుగుదురు?
నేడు శీతల చందన గంధ
పరీమళ సమ్మిశ్రిత వాయు పరీహాస
క్రీలతో, అపరిమాణ వాడ్రేయ
శరీరంతో నిల్చిన కీర్తిస్తంభాలు
కనులు తెరచి యూగిసిలాడే
తళ త్తళ రేఖా సౌందర్య గరిమ
వహించలేక, పరిభ్రమించు
ఉన్మాదిని వినీలజలద విలాసిని
సుమించి గాలికి రాలిపోవు
పూకన్నియ, ప్రకాశించి కారు
రోతిరి పాలి పోవు చంద్రబింబం
కడు దవ్వునుండి శైలమెత్తు
యెగసి పడిపోవు తరంగం.

అందమైన ప్రతి వస్తువు భౌతిక
రూప మశాశ్వతమ్ము జగత్తులో.
శశ్వత్కాలిక వస్తువు ప్రయోజనం
లౌకిక జగత్తున కర్థరహిత భాజనమ్ము.
గగన తలంపై వెలిగే సూర్యచంద్రులు
ఏ విశ్వనాథుని కీర్తి చిహ్న కేతనాలు?
నా కనులనుండి మీ కనులదాకా
యెగసి నిల్చిన; తాజమహల్ అజంతా
కళా ఖండాల్లా లక్షలాది రసరాణ్మల
సమాకర్షించలేని కీర్తి స్తంభాలు.
శిశువునకు, పశువునకు, స్పందించే
గుండెలేని తనూశిలకు కనుపించని
స్వేచ్ఛశ్వేత వర్ణ మూర్తి వంతములు
కాల శ్మశానంలోని యీ కీర్తిస్తంభములు.